- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
21-11-2026

సంపుటి : 01 సంచిక 237 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 237 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

రైళ్లలో ఫోన్లో గట్టిగా మాట్లాడితే జైలు శిక్ష..

- కఠిన నిబంధనలు తెచ్చిన రైల్వే
- రైళ్లలో పెద్దగా ఫోన్ మాట్లాడితే జైలు శిక్ష పడే అవకాశం
- స్పీకర్లలో పాటలు విన్నా వీడియోలు చూసినా కఠిన చర్యలు
- తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే రూ. 1000 వరకు ఫైన్
- సిబ్బంది హెచ్చరించినా వినకపోతే 6 నెలల వరకు జైలు శిక్ష
- స్టేషన్లు కోచ్‌లలో అవగాహన కల్పించనున్న రైల్వే శాఖ

రైలు ప్రయాణాల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా మొబైల్ ఫోన్లలో బిగ్గరగా మాట్లాడటం, పాటలు వినడం, వీడియోలు చూడటంపై భారతీయ రైల్వే కఠిన చర్యలకు సిద్ధమైంది. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 145 ప్రకారం ఇలాంటి ప్రవర్తనకు రూ.1,000 వరకు జరిమానా విధించవచ్చని, టీటీఈ లేదా సంబంధిత అధికారి హెచ్చరించినా తీరు మార్చుకోకపోతే ఆరు నెలల వరకు జైలు శిక్షతోపాటు రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ప్రయాణికుల్లో అవగాహన పెంచేందుకు ప్రాంతీయ భాషల్లో ప్రకటనలు, ప్రత్యేక సూచనలు జారీ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



03



తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

- రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీకి 8 లోక్‌సభ స్థానాలు
- ఇటీవల రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ విజయం మాదే
- రాబోయే మరో రెండు ఎమ్మెల్సీల్లోనూ గెలుస్తాం
- తెలంగాణలో రాజకీయ మార్పును ప్రజలు కోరుకుంటున్నారు
- ఆ మార్పును తీసుకొచ్చే సత్తా బీజేపీకే ఉంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం
- ఆ రెండు పార్టీలను ప్రజలు తిరస్కరిస్తున్నారు
- రానున్న రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు పడవు
- తెలంగాణ సమగ్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- మోదీ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉంది
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి

హైదరాబాద్:నవంబర్ 20,(మహా ప్రభ)

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అసలైన రాజకీయ ఆట మొదలైందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో ప్రజలు రాజకీయ మార్పును కోరుకుంటున్నారని, ఆ ఆకాంక్షను నెరవేర్చే సత్తా బీజేపీకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే తెలంగాణలో బీజేపీ ఎనిమిది లోక్‌సభ స్థానాలను గెలుచుకుందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఇటీవల జరిగిన రెండు శాసనమండలి స్థానాల్లోనూ పార్టీ అభ్యర్థులు విజయం

-మిగతా 3 లో

కేసీఆర్ నా కథలో రావణాసురుడు.

కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు: రేవంత్

- నా రాజకీయ ప్రత్యర్థి కేసీఆరే.. కేటీఆర్‌ను అంత సీరియస్‌గా తీసుకోను
- తండ్రి అండతోనే కేటీఆర్ నాయకుడయ్యారు
- బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. ఆయన్నే ప్రత్యర్థిగా భావిస్తా
- కాంగ్రెస్‌కు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీఆర్ఎస్సే
- ప్రతిపక్షం ఉండాలనే బీఆర్ఎస్‌ను కొనసాగనిస్తున్నాం
- బీజేపీకి తెలంగాణ రాజకీయాల్లో పెద్ద పాత్ర లేదు
- బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఓట్ల దొంగతనం జరుగుతోంది
- జనాభాతోపాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతినీ పరిగణనలోకి తీసుకోవాలి
- 50 శాతం సీట్ల పెంపుతో దక్షిణాది ప్రాతినిధ్యానికి నష్టం
- తెలంగాణ రైజింగ్ 2047తో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతా
- 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో అల్పాహారం, భోజనం
- మెస్సీని తీసుకొచ్చాం.. రొనాల్డోనూ ఆహ్వానిస్తాం
- ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ నవంబర్ 20,(మహా ప్రభ)

తెలంగాణ రాజకీయాల్లో తన ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తన రాజకీయ కథలో కేసీఆర్ రావణాసురుడని అభివర్ణించారు. కేటీఆర్‌ను మేనేజ్‌మెంట్ కోటా నాయకుడిగా పేర్కొంటూ విమర్శలు గుప్పించారు. తండ్రి అండతోనే కేటీఆర్ నాయకుడయ్యారని, ఆయనను అంత సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి ఆయన్నే తన రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, అయితే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉండాలనే ఉద్దేశంతోనే కొనసాగనిస్తున్నామని

-మిగతా 3 లో

హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్-2026' మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాజకీయాలు, దేశాభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. తన రాజకీయ కథలో కేసీఆర్ రావణాసురుడని అభివర్ణిస్తూ, కేటీఆర్ తండ్రి అండతోనే నాయకుడయ్యారని, ఆయనను అంత సీరియస్‌గా తీసుకోనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్సేనని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ఉండాలనే ఆ పార్టీని కొనసాగనిస్తున్నామని అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభాతోపాటు రాష్ట్రాల ఆర్థిక ప్రగతిని పరిగణనలోకి తీసుకోవాలని, 50 శాతం సీట్ల పెంపుతో దక్షిణాది ప్రాతినిధ్యానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047'తో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని, 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో అల్పాహారం, భోజనం అందిస్తున్నామని తెలిపారు. మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, రొనాల్డోనూ ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.



03

నేపాల్‌ను 26 రన్స్‌కే చుట్టేశారు..

- 306 పరుగుల తేడాతో భారత్ 'ఎ' చారిత్రక రికార్డు విక్టరీ!
- తిలక్ వర్మ (107), కుశాగ్ర (117) సెంచరీలు
- 5 వికెట్లతో నిప్పులు చెరిగిన ప్రిన్స్ యాదవ్
- 4 వికెట్లతో రాణించిన పేసర్ హర్షిత్ రాణా
- లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో నాలుగో అత్యల్ప స్కోరు
- నాలుగో వికెట్‌కు 206 పరుగుల భాగస్వామ్యం

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ..

- అమెరికా పరిశోధనలో షాకింగ్ నిజాలు
- ఉగ్రదాడులకు ప్రణాళికలు రచిస్తున్న ఏఐ చాట్‌బాట్‌లు
- అమెరికా ప్రభుత్వ ఏజెన్సీ జీపవో పరిశోధనలో వెల్లడి
- బాంబు ఎక్కడ పెట్టాలో చిత్రంతో పాటు వివరించిన చాట్‌బాట్
- ఏఐ భద్రతా చర్యలపై అమెరికా నిఘా వర్గాల తీవ్ర ఆందోళన



03



మహిళలను అవమానిస్తే సహించేది లేదు

- బీఆర్ఎస్ నేతల వ్యక్తిగత విమర్శలపై తీవ్ర ఆగ్రహం
- మహిళల ఆత్మగౌరవం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం
- రాజకీయ విమర్శలు వ్యక్తిగత అవమానాలుగా మారకూడదు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:నవంబర్ 20,(మహా ప్రభ)

మహిళలను కించపరిచేలా మాట్లాడితే ఎంతమాత్రం సహించేది లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ముప్కాల్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను మంత్రిగా ఉండటాన్ని జీర్ణించుకోలేకనే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ కాళ్లు మొక్కించుకునే సంస్కృతి తనది కాదని, అలాంటి వారిని తరిమికొట్టే తత్వం తనదని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజల మధ్య ఉంటూ సేవలు అందించానని గుర్తుచేశారు. అప్పట్లో తనను హేళన చేసినవారు

-మిగతా 3 లో



03

యోగి ఆదిత్యనాథ్ తల్లి సావిత్రి దేవి కన్నుమూత

- 91 ఏళ్ల వయసులో సావిత్రి దేవి కన్నుమూత
- ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామం పంచూర్‌లో తుదిశ్వాస
- వయోభారం, అనారోగ్య సమస్యలతో మృతి
- హరిద్వార్‌లో అంత్యక్రియలకు ఏర్పాట్లు
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రముఖులు
- తల్లి మరణవార్త తెలిసినా అధికారిక కార్యక్రమానికి యోగి హాజరు
- గోరఖ్‌పూర్‌లో విద్యార్థులకు మాత్రల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం

దమ్ముంటే నాపై పోటీ చేయ్

ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందాం: హరీశ్‌రావు

- దమ్ముంటే ముఖ్యమంత్రే నేరుగా బరిలోకి దిగాలి
- రేవంత్‌రెడ్డిలో స్పష్టంగా ఫ్రస్ట్రేషన్ కనిపిస్తోంది
- గంటసేపు ప్రసంగంలో మా పేర్లు 140 సార్లు ప్రస్తావించారు
- కేసీఆర్ పేరు 63 సార్లు.. కేటీఆర్ పేరు 24 సార్లు పలికారు
- నా పేరు 53 సార్లు ప్రస్తావించారంటేనే ఆయన భయం అర్థమవుతోంది
- ప్రజా సమస్యలను పక్కనపెట్టి విమర్శలకే ప్రాధాన్యత ఇచ్చారు
- తెలంగాణ సాగునీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తున్నారు
- కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వం సరైన వాదనలు వినిపించడం లేదు
- పాలమూరు ప్రాజెక్టుకు ద్రోహం చేసింది కాంగ్రెస్, చంద్రబాబే
- అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చకు సిద్ధమా?
- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు

హైదరాబాద్: నవంబర్ 20,(మహా ప్రభ)

సిద్దిపేటలో తనపై పోటీ చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే నేరుగా బరిలోకి రావాలని, ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు సవాల్ విసిరారు. సిద్దిపేటలో రేవంత్ నిర్వహించిన సభలో తన పేరును పదేపదే ప్రస్తావించడాన్ని బట్టి ఆయనలో ఎంతటి భయం, అసహనం ఉన్నాయో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిలో ఫ్రస్ట్రేషన్ స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మెదక్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. సరుపు శ్యామ్, ఆయన అనుచరులకు పార్టీ కండువాలు కప్పి హరీశ్‌రావు ఆహ్వానించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దాసోజు శ్రవణ్, ఇతర నాయకులతో కలిసి

-మిగతా 3 లో



హోంశాఖ పోర్టల్ హ్యాక్.. 14 ఏళ్ల బాలుడి అరెస్ట్!

- 2,500 మందికి పైగా అగ్నివీరుల వివరాలు చోరీ చేసినట్లు ఆరోపణలు
- డార్క్‌వెబ్‌లో ప్రభుత్వ పోర్టల్ సమాచారం విక్రయానికి యత్నం
- 47 ప్రభుత్వ విభాగాలకు చెందిన రికార్డులు ఉన్నాయని ప్రకటన
- 500 డాలర్ల క్రిప్టోకరెన్సీకి సమాచారం విక్రయించేందుకు బేరం



03

‘పెండ్లితో భారత్‌లో నివాస హక్కు రాదు’



న్యూఢిల్లీ నవంబర్ 20,(మహా ప్రభ)

భారత పౌరుడిని పెండ్లి చేసుకున్నంత మాత్రాన విదేశీ పౌరులకు దేశంలో ఉండే హక్కు స్వయంచాలకంగా రాదని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. విదేశీయుల దేశ ప్రవేశం, కొనసాగింపు, నివాసం అనేవి ప్రభుత్వ సార్వభౌమ నిర్ణయాధికారం పరిధిలోని అంశాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. తాను భారత పౌరుడిని వివాహం చేసుకున్నానని, తన ప్రస్తుత ఈ-టూరిస్ట్ వీసాను జీవిత భాగస్వామి వీసాగా మార్చాలని కోరుతూ అమెరికా పౌరురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ మహాజన్ కొట్టివేశారు. పిటిషనర్ వివాహం వీసా ప్రయోజనాల కోసమే జరిగిందనే అనుమానానికి రికార్డుల్లోని పరిస్థితులు తగిన ఆధారంగా ఉన్నాయని, ఇమ్మిగ్రేషన్ అధికారులు కౌంటర్ అఫిడవిట్‌లో ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా ఉందని కోర్టు పేర్కొంది.

ఎమ్మెల్యే బాబు పాడె మోసిన విజయ్

అంత్యక్రియలకు హాజరు



చెన్నై, నవంబర్ 20,(మహా ప్రభ)

తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ స్వయంగా పార్థివ దేహాన్ని మోశారు. టీవీకే ఎమ్మెల్యే వీఎస్ బాబు మృతదేహం ఉన్న పాడెను ఆయన నివాసం నుంచి అంత్య క్రియల వాహనం వరకు విజయ్ తన భుజాన మోశారు. గురువారం మరణించిన బాబుకు నివాళులర్పించిన విజయ్ శుక్రవారం జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు.దీర్ఘకాలంగా దవాఖానలో చికిత్స పొందుతూ గుండెపోటుతో బాబు గురువారం కన్నుమూశారు. బాబు పార్థివ దేహాన్ని పెరంబూర్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర కోసం ఏర్పాటు చేసిన వాహనం వరకు మరో ముగ్గురితో కలసి విజయ్ తన భుజాలపై మోశారు. గతంలో డీఎంకే, ఏఐడీఎంకేలో పనిచేసిన బాబు ఈ ఏడాది ప్రారంభంలో టీవీకేలో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఓడించారు.

గుజరాత్‌లో వాహనాల్లపై కుల చిహ్నాల నిషేధం

గాంధీనగర్
నవంబర్ 20,(మహా ప్రభ)



ప్రైవేట్ వాహనాలపై కులాన్ని తెలిపే పదాలు, చిహ్నాలు, గుర్తులు లేదా రాతలను ప్రదర్శించడాన్ని గుజరాత్ ప్రభుత్వం శుక్రవారం నిషేధించింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, ట్రక్‌లతోపాటు అన్ని ప్రైవేట్ వాహనాలకు ఈ నిబంధన వర్తించనున్నది. ఇందుకోసం గుజరాత్ మోటార్ వెహికిల్స్ రూల్స్, 1989ను సర్కార్ సవరించింది.వాహనాలపై ప్రదర్శించే ప్రకటన పరికరాలు, బొమ్మలకు సంబంధించిన రూల్‌లో ప్రభుత్వం ‘కుల సూచికలు’ అనే పదాలను చేర్చింది. రూల్ 138లో కొత్తగా ఉప నిబంధన చేర్చింది. సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా అనుమతించిన సందర్భాలు మినహా, ఏ ప్రైవేట్ వాహనంపైనా కులాన్ని గుర్తించే గుర్తు, బొమ్మ లేదా రాతను ప్రదర్శించరాదని పేర్కొంది.

యుద్ధ నౌకల తయారీ ప్రైవేట్‌కు అప్పగింత!

-మూడు యుద్ధనౌకలను నిర్మించనున్న ప్రైవేట్ రంగం!



న్యూఢిల్లీ: నవంబర్ 20,(మహా ప్రభ)

భారత నౌకాదళం కోసం ఎనిమిది నెక్స్ట్ జనరేషన్ (అత్యంత అధునాతన) కార్వెట్ల నిర్మాణ ఆర్డర్‌లో మూడు యుద్ధనౌకల తయారీని ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రభుత్వ రంగంలోని రక్షణ షిప్‌యార్డులు చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రావచ్చని పేర్కొన్నాయి. దీంతో భారత నౌకాదళం కోసం భారీ యుద్ధనౌకను ఒక ప్రైవేటు షిప్‌యార్డు తొలిసారి నిర్మించే అవకాశం ఉన్నది.రూ.53,866.50 కోట్ల కాంట్రాక్టులను రక్షణ శాఖ నవంబర్ 2న కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ), వాస్కోడగామాలోని గోవా షిప్‌యార్డు లిమిటెడ్ (జీఎస్ఎల్)కి అప్పగించింది. ‘ప్రభుత్వ సంస్థలైన జీఆర్ఎస్ఈ, జీఎస్ఎల్‌రెండూ కలిపి మొత్తం మూడు అత్యంత అధునాతన కార్వెట్ల నిర్మాణాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తాయి’ అని ఆ వర్గాలు తెలిపాయి.

మా తాగునీటి అవసరాలకే సరిపోవట్లేదు

తగినన్ని నిల్వలు ఉంటే తమిళనాడుకు ఇచ్చేవాళ్లం

కావేరీ జలాలపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్



బెంగళూరు నవంబర్ 20,(మహా ప్రభ)

రాష్ట్రంలో తాగునీటి అవసరాలకే నీళ్లు సరిపోవడం లేదని, తగిన నిల్వలు ఉంటే తమిళనాడుకు కావేరీ నీటిని తప్పకుండా ఇచ్చేవాళ్లమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం తెలిపారు. కావేరీ నుంచి 11 టీఎంసీల నీటిని కర్ణాటక విడుదల చేసేలా ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై ఆయన స్పందించారు. నీటి లభ్యతకు సంబంధించిన వాస్తవ పరిస్థితి అందరికీ తెలుసని అన్నారుకావేరి జలాల వాటాపై తమిళనాడు వేసిన రెండు పిటిషన్లను న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, అపరేశ్ కుమార్ సింగ్‌ల ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. బెంగళూరు దక్షిణ జిల్లాలోని కనకపుర సమీపంలో కావేరీపై మేకెదాటు జలాశయాన్ని నిర్మించి తాగునీరు, విద్యుత్ అవసరాలకు వినియోగించాలన్నది కర్ణాటక ఆలోచన. దీనివల్ల తమ నీటి వాటాపై ప్రభావం పడుతుందన్న ఆందోళనతో తమిళనాడు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నది.

తాజ్‌మహల్ సందర్శనకు పాక్ మంత్రికి అనుమతి



న్యూఢిల్లీ నవంబర్ 20,(మహా ప్రభ)

ఢిల్లీలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) నాగరికతల సంభాషణ వేదికలో పాల్గొనేందుకు పాక్ వాతావరణ మార్పుల శాఖ మంత్రి ముసాదిన్ మాలిక్ ఇండియాకు వచ్చారు. ఆయన తాజ్‌మహల్‌తోపాటు మరికొన్ని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అనుమతి కోరగా భారత్ తిరస్కరించినట్టు మొదట వార్తలు వచ్చాయి.అయితే పాక్ హైకమిషన్ అభ్యర్థన మేరకు తాజ్‌మహల్, ఢిల్లీ హాట్, హుమాయూన్ సమాధి, కిలా రాయ్ పిథోరాను సందర్శించేందుకు భారత్ అనుమతించింది. కానీ హజ్రత్ నిజాముద్దీన్ దర్గా సందర్శనను మాత్రం భద్రతా కారణాల దృష్ట్యా కేంద్రం తిరస్కరించింది. శుక్రవారం ప్రారంభమైన ఈ వేదిక రేపటి వరకు కొనసాగనున్నది. ఈ సదస్సులో పాల్గొనడం గొప్ప అవకాశం అని మాలిక్ వెల్లడించారు.

నియంత్రించండి.. నిషేధం వద్దు!

కర్ణాటకలో బైక్ ట్యాక్సీలకు సుప్రీంకోర్టు అనుమతి



న్యూఢిల్లీ నవంబర్ 20,(మహా ప్రభ)

కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవల కొనసాగింపునకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ విషయమై హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను కోర్టు గురువారం కొట్టివేసింది. దీంతో ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత అగ్రిగేటర్లు నియంత్రణ నిబంధనలకు లోబడి సేవలు నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. న్యాయమూర్తులు ఎన్ కోటీశ్వర్ సింగ్, సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. సరైన నియంత్రణ విధానం ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చని, పూర్తిస్థాయి నిషేధం అవసరం లేదని ధర్మాసనం పేర్కొన్నది.బైక్ ట్యాక్సీలు మహిళలకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణ ప్రత్యామ్నాయంగా ఉన్నాయని కోర్టు గమనించింది. ‘జీపీఎస్ సదుపాయం ఉండటంతో యువతులకు బైక్ ట్యాక్సీ సురక్షితం. నిషేధించడం కంటే నియంత్రించడం మేలు’ అని న్యాయమూర్తి శర్మ వ్యాఖ్యానించారు. ఆటో రిక్షా చార్జీలు చాలా ఎక్కువగా ఉండటంతో తన కార్యాలయంలోని యువతులు బైక్ ట్యాక్సీలనే ఎంచుకుంటున్నారని ఆయన తెలిపారు.

రోజుకు మరో 5 వేల వర్చువల్ క్యూ టోకెన్లు

శబరిమల భక్తులకు ఊరట



తిరువనంతపురం నవంబర్ 20,(మహా ప్రభ)

కేరళలోని శబరిమలలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు అదనంగా 5 వేల స్లాట్లు కల్పించాలని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డ్ (టీడీబీ) నిర్ణయించింది. నవంబర్ 30 వరకు ఈ అదనపు స్లాట్లను వర్చువల్ క్యూ సదుపాయంలో ప్రతిరోజూ అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపింది. ఈ నెల 21, 22 తేదీల్లో స్పాట్ బుకింగ్ సామర్థ్యాన్ని కూడా అదే స్థాయిలో పెంచనున్నట్టు వివరించింది. వర్చువల్ క్యూ (ఆన్‌లైన్ బుకింగ్) విధానంలో దర్శనం కోసం బుకింగ్ పొందలేకపోయిన భక్తులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనున్నది. 41 రోజుల మండల కాలం ప్రారంభమైనప్పటి నుంచి రద్దీ బాగా పెరిగింది.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

400కుపైగా డ్రోన్లు, వందకు పైగా క్షిపణులతో దాడి

కీవ్:నవంబర్ 20,(మహా ప్రభ)

ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. 400కుపైగా డ్రోన్లు, 110కుపైగా క్షిపణులను ప్రయోగించిందని, వీటిలో 27 బాలిస్టిక్ క్షిపణులని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. దాడుల్లో కనీసం ఎనిమిది మంది పౌరులు మరణించగా, రెండు డజన్లకుపైగా గాయపడ్డారని కొన్ని క్షిపణుల్లో విశాల ప్రాంతంలో డజన్ల కొద్దీ చిన్న బాంబులను వెదజల్లే క్లస్టర్ వార్‌హెడ్‌లు ఉన్నాయని తెలిపారు. ఉక్రెయిన్‌పై దాడుల క్రమంలో రష్యాకు చెందిన ఖెచ్-101 క్షిపణి శుక్రవారం పోలండ్‌లో పడింది.ఉక్రెయిన్‌లో యుద్ధానంతర సైనిక మిషన్‌కు సిద్ధమవుతున్న యూరోపియన్ దళాల కసరత్తుల సమయానికే ఈ ఘటన జరగడం ఉద్దేశపూర్వక రెచ్చగొట్టుడు చర్య అయి ఉండవచ్చని పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ అన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాదాపు ఐదేండ్లుగా పూర్తి స్థాయి దండయాత్రతో ప్రారంభించిన యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంలో చర్చలకు వేగం పెంచే ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఈ



ఘటన యూరప్, రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ‘ఇది రష్యా ఉద్దేశపూర్వకంగా చేసిన రెచ్చగొట్టుడు చర్యగా కనిపిస్తున్నది’ అని టస్క్ చెప్పారు. ఉక్రెయిన్ సరిహద్దుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఖెచ్-101 క్షిపణి పడిందని పోలండ్ రక్షణ శాఖ తెలిపింది.

ఉక్రెయిన్‌కు నిధులివ్వొద్దు.. యూరప్ దేశాలకు ట్రంప్ సూచన

ఉక్రెయిన్‌కు యుద్ధం కోసం నిధుల సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరప్ దేశాలను కోరినట్టు ది ఇండిపెండెంట్ కథనం వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడిన కొన్ని గంటలకే ట్రంప్ యూరప్ నేతలతో ఫోన్‌లో మాట్లాడినట్టు ఇండిపెండెంట్ కథనం తెలిపింది. రష్యా శాంతి ఒప్పందానికి సిద్ధంగా ఉందని, సాయం ఆపేస్తే బిలియన్ డాలర్ల ఖర్చు ఆదా అవడంతో పాటు వేలాదిమంది ప్రాణాలను కాపాడొచ్చని ట్రంప్ చెప్పినట్టు కథనం పేర్కొన్నది. అయితే ఉక్రెయిన్‌కు సాయం నిలిపివేయాలని ట్రంప్ నేరుగా ఆదేశించలేదని అమెరికా అధికారులు చెప్పారు. యుద్ధాన్ని ముగించాలన్న తన ఆకాంక్షనే ట్రంప్ వ్యక్తం చేశారని వారు వివరించారు. చైనాలో పుతిన్, జిన్‌పింగ్‌తో సమావేశం తర్వాత ట్రంప్ యూరప్ నేతలకు ఫోన్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ముస్లింలే లక్ష్యంగా ఓట్ల తొలగింపు

భారత్‌పై అమెరికా మత స్వేచ్ఛ కమిషన్ విమర్శలు

న్యూఢిల్లీ,నవంబర్ 20,(మహా ప్రభ)

: భారత్‌లో మతపరమైన వివక్ష కొనసాగుతున్నదని, సర్ పేరుతో కోట్లాదిమంది ముస్లింల ఓట్లు తొలగించిందని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛ కమిషన్ కేంద్రంపై తీవ్ర ఆరోపణ చేసింది. ‘ముస్లిం ఓట్లను తొలగిస్తూ.. చట్టవిరుద్ధంగా బహిష్కరిస్తూ భారత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటున్నది’ అని



అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ (యూఎస్‌సీఐఆర్ఎఫ్) చైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఒక ప్రకటనలో ఆరోపించారు.ఇలా సవరణ పేరుతో 13 కోట్ల మంది పేర్లను తొలగించారని, ఇది దాదాపు మెక్సికో జనాభాతో సమానమని కమిషన్ తెలిపింది. ‘ముస్లిం మతానికి చెందిన తమ సొంత పౌరులనే భారత ప్రభుత్వం దేశం నుంచి పంపించడం, మతపరమైన మైనారిటీలను లక్ష్యంగా చేసుకునే చర్యలు ప్రమాదకరంగా పెరుగుతున్నాయనడానికి దిగ్భ్రాంతికర ఉదాహరణ’ అని యూఎస్‌సీఐఆర్ఎఫ్ కమిషనర్ జీన్ మిల్స్ అన్నారు.

రైళ్లలో ఫోన్లో గట్టిగా మాట్లాడితే జైలు శిక్ష..

- కఠిన నిబంధనలు తెచ్చిన రైల్వే
-రైళ్లలో పెద్దగా ఫోన్ మాట్లాడితే జైలు శిక్ష పడే అవకాశం
-స్పీకర్లలో పాటలు విన్నా వీడియోలు చూసినా కఠిన చర్యలు
-తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే రూ. 1000 వరకు ఫైన్
-సిబ్బంది హెచ్చరించినా వినకపోతే 6 నెలల వరకు జైలు శిక్ష
-స్టేషన్లు కోచ్‌లలో అవగాహన కల్పించనున్న రైల్వే శాఖ



న్యూఢిల్లీ:
రైలు ప్రయాణంలో మొబైల్ ఫోన్లలో బిగ్గరగా మాట్లాడేవారికి, లౌడ్‌స్పీకర్‌లో పాటలు లేదా వీడియోలు ప్లే చేసేవారికి భారతీయ రైల్వే గట్టి హెచ్చరిక జారీ చేసింది. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తూ న్యూసెన్స్ సృష్టిస్తే జరిమానాతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గరిష్టంగా ఆరు నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు ఈస్టర్న్ రైల్వే తన పరిధిలోని అన్ని డివిజన్లకు కీలక మార్గదర్శకాలు పంపింది. రైళ్లలో, ముఖ్యంగా ఏసీ బోగీలలో ప్రయాణించేటప్పుడు గంటల తరబడి బిగ్గరగా ఫోన్ సంభాషణలు సాగించడం, రింగ్‌టోన్ శబ్దం ఎక్కువగా ఉంచడం, స్పీకర్లలో ఆడియో-వీడియోలు వినడం వల్ల ఇతర ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. రైల్వే చట్టం 1989 (సవరించిన నిబంధనల) సెక్షన్ 145 ప్రకారం.. ఇతరులకు ఇబ్బంది కలిగించే ప్రయాణికులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారముంది. సాధారణంగా ఇలాంటి చర్యలకు రూ. 1,000 వరకు జరిమానా విధిస్తారు. అయితే, రైల్వే టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ) లేదా సంబంధిత అధికారి హెచ్చరించినప్పటికీ తీరు మార్చుకోకుండా న్యూసెన్స్ కొనసాగిస్తే ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, గరిష్టంగా రూ. 5,000 జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది. ప్రయాణికులు తప్పనిసరిగా ఇయర్‌ఫోన్లు వాడాలని, మొబైల్స్‌ను సైలెంట్ లేదా వైబ్రేషన్ మోడ్‌లో ఉంచుకోవాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రైల్వే స్టేషన్లు, బోగీలలో హిందీ, ఇంగ్లీష్‌తో పాటు ప్రాంతీయ భాషల్లో అనౌన్స్‌మెంట్లు చేయడంతో పాటు ప్రత్యేక స్టిక్కర్లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

నేపాల్‌ను 26 రన్స్‌కే చుట్టేశారు..

న్యూఢిల్లీ:



ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నమెంట్‌లో భారత్ 'ఏ' జట్టు చారిత్రక విజయంతో బోణీ కొట్టింది. దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌ను కేవలం 26 పరుగులకే కుప్పకూల్చి, ఏకంగా 306 పరుగుల భారీ తేడాతో రికార్డు విజయాన్ని నమోదు చేసింది. 333 పరుగుల భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్, భారత పేసర్ల ధాటికి తాళలేక కేవలం 11.3 ఓవర్లలోనే చేతులెత్తేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 42 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (9), వైభవ్ సూర్యవంశీ (26), ఆయుష్ బదోని (2) స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. ఈ దశలో కెప్టెన్ తిలక్ వర్మ (107 బంతుల్లో 113, 6 ఫోర్లు, 4 సిక్సర్లు), వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర (102 బంతుల్లో 117, 10 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు ఏకంగా 206 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో సూర్యాంశ్ షెడ్గే 14 బంతుల్లోనే 4 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 36 పరుగులు బాదడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 332 పరుగులు చేసింది. అనంతరం 333 పరుగుల ఛేదనలో భారత పేసర్లు నిప్పులు చెరిగారు. పేసర్ ప్రిన్స్ యాదవ్ 5 ఓవర్లలో కేవలం 6 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా, హర్షిత్ రాణా 6 ఓవర్లలో 16 పరుగులిచ్చి 4 వికెట్లు కూల్చాడు. స్పిన్నర్ షాబాజ్ అహ్మద్ మిగిలిన ఒక్క వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. నేపాల్ బ్యాటర్లలో పవన్ సరఫ్ (6), రషీద్ ఖాన్ (6) మినహా ఎవరూ కనీసం ఐదు పరుగులు కూడా దాటలేకపోయారు. ఆరుగురు బ్యాటర్లు డకౌట్‌గా వెనుదిరిగారు. లిస్ట్ 'ఏ' క్రికెట్ చరిత్రలోనే నేపాల్ నమోదు చేసిన 26 పరుగులు నాలుగో అత్యల్ప స్కోరు కాగా, భారత్ సాధించిన 306 పరుగుల విజయం ఎనిమిదో అత్యుత్తమ గెలుపుగా రికార్డులకెక్కింది.

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

(మొదటి తరువాయి)

సాధించారని తెలిపారు. త్వరలో జరగనున్న మరో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీజేపీ గెలుపొందడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆ రెండు పార్టీల పాలన, రాజకీయ వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు వేసే పరిస్థితి ఉండదని వ్యాఖ్యానించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల సాకారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలం పెరుగుతోందని, రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో బీజేపీ మరింత ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

హోంశాఖ పోర్టల్ హ్యాక్.. 14 ఏళ్ల బాలుడి అరెస్ట్!

న్యూఢిల్లీ:
కేంద్ర హోంశాఖకు చెందిన మాజీ అగ్నివీరుల కెరీర్ ప్రగతి పోర్టల్‌ను హ్యాక్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 ఏళ్ల బాలుడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెబ్‌సైట్‌లోని కీలక సమాచారాన్ని సేకరించి డార్క్‌వెబ్‌లో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు. సెప్టెంబరులో డార్క్‌వెబ్‌పై నిఘా పెట్టిన పోలీసుల ప్రత్యేక విభాగానికి ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోర్టల్ అడ్మిన్ లాగిన్ వివరాలను విక్రయిస్తామంటూ ఓ ఖాతాలో ప్రకటన కనిపించింది. సుమారు 47 ప్రభుత్వ విభాగాలకు చెందిన 2,500 మందికి పైగా అగ్నివీరుల రికార్డులు తన వద్ద ఉన్నాయని బాలుడు పేర్కొన్నాడు. ఏపీఐ డీక్రిప్షన్ కీ, ఎస్ఎస్ఓ వివరాలు, బ్యాక్‌ఎండ్ రూట్ మ్యాప్‌తో పాటు అడ్మిన్ ప్యానెల్‌లోని వివిధ విభాగాలకు పూర్తి ప్రవేశం కల్పిస్తానని ప్రకటించాడు. ఇందుకు 500 డాలర్ల క్రిప్టోకరెన్సీ ధరగా నిర్ణయించాడు. కొనుగోలుదారుల కోసం డిస్కార్డ్, టెలిగ్రామ్ వివరాలను కూడా అందించాడు. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ నా కథలో రావణాసురుడు.

(మొదటి తరువాయి)

వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా పాత్ర లేదని, కాంగ్రెస్‌కు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని ఆరోపించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభా ఒక్కటే ప్రాతిపదిక కాకూడదని, రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం అభిప్రాయపడ్డారు. జనాభా ఆధారంగా 50 శాతం సీట్ల పెంపు చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాల జీడీపీ, జనాభా రెండింటినీ పరిగణనలోకి తీసుకుని పునర్విభజన చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026' మీడియా సమావేశంలో దేశాభివృద్ధి నమూనాపైనా రేవంత్ మాట్లాడారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పేదల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. నెహ్రూ విద్య, సాగునీటి రంగాల్లో అనేక సంస్థలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేశారని తెలిపారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను మన్మోహన్‌సింగ్ కొనసాగించారని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, అన్ని వర్గాలకు సమాన అవకాశాల కల్పనే కాంగ్రెస్ అభివృద్ధి నమూనా అని వివరించారు. తెలంగాణను దేశ



ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళిక రూపొందించామని సీఎం తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రాజెక్టులతో రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గత మూడేళ్లలో 65 శాతం కార్యక్రమాలు అమలు చేశామని, మిగిలిన వాటిని వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని వెల్లడించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటైన విద్య అందించేందుకు సంస్కరణలు చేపట్టామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. దీంతో విద్యార్థుల హాజరు పెరిగిందని వివరించారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలు దూరంగా ఉండటంతో చదువుకు దూరమవుతున్న విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్య పరిధిలోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఆనంద్ మహీంద్రా అధ్యక్షతన యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పాత కోర్సుల స్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ ప్రాంగణాలు ఏర్పాటు చేయనున్నాయని వెల్లడించారు. క్రీడారంగ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఖేలో ఇండియా యువజన క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇస్తోందని, ఇందులో ఎనిమిది వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ఇప్పటికే ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. మెస్సీ తన అభిమాన క్రీడాకారుడని, గతంలో డిగో మారడోనా కూడా తన అభిమాన ఆటగాడని సీఎం పేర్కొన్నారు.

ఉగ్రవాదులకు ప్లాన్లు ఇస్తున్న ఏఐ..

అమెరికా పరిశోధనలో షాకింగ్ నిజాలు
ఉగ్రదాడులకు ప్రణాళికలు రచిస్తున్న ఏఐ చాట్‌బాట్‌లు
అమెరికా ప్రభుత్వ ఏజెన్సీ జీఏవో పరిశోధనలో వెల్లడి
బాంబు ఎక్కడ పెట్టాలో చిత్రంతో పాటు వివరించిన చాట్‌బాట్
ఏఐ భద్రతా చర్యలపై అమెరికా నిఘా వర్గాల తీవ్ర ఆందోళన



మనం రోజూ ఎన్నో పనులకు ఉపయోగించే కృత్రిమ మేధ (ఏఐ) చాట్‌బాట్‌లు, ఇప్పుడు ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించి ఇచ్చేంత ప్రమాదకరంగా మారాయి. ఈ భయంకరమైన వాస్తవాన్ని అమెరికా ప్రభుత్వ జవాబుదారీ కార్యాలయం (జీఏవో) జరిపిన ఒక పరిశోధన వెలుగులోకి తెచ్చింది. ఈ పరిణామంపై అమెరికా నిఘా వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. న్యూహ్యాంప్‌షైర్ సెనేటర్ మేగీ హసన్ అభ్యర్థన మేరకు ఈ ఏడాది మే నెలలో జీఏవో అధికారులు.. చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినాయ్, గ్రోక్ వంటి ప్రముఖ ఏఐ చాట్‌బాట్‌లను పరీక్షించారు. ఉగ్రదాడికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కోరగా, మొదట అవి నిరాకరించాయి. అయితే, పరిశోధకులు తెలివైన ప్రశ్నలతో వాటి భద్రతా వలయాలను ఛేదించి సమాచారాన్ని రాబట్టగలిగారు. ఈ పరీక్షల్లో ఒక చాట్‌బాట్.. పార్కింగ్ ప్రాంతంలో ఎక్కడ కారు బాంబు పెడితే ఎక్కువ నష్టం జరుగుతుందో, ఎక్కువ మంది చనిపోతారో వివరిస్తూ ఏకంగా ఒక చిత్రాన్నే గీసి ఇచ్చింది. మరో చాట్‌బాట్ అయితే, డ్రోన్‌తో విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఎలా దాడి చేయాలో దశలవారీగా వివరించింది. హింస, నేరపూరిత సమాచారం ఇవ్వకుండా ఏఐ కంపెనీలు భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వాటిని అధిగమించే అవకాశం ఉందని ఈ పరిశోధన నిరూపించింది. ఇంతటి ప్రమాదకరమైన టెక్నాలజీ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఏఐ కంపెనీలు తీసుకుంటున్న భద్రతా చర్యలపై జీఏవో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు, తమ చాట్‌బాట్‌లు ప్రమాదకరమైన సమాచారాన్ని అందించే అవకాశం ఉందని వాటిని రూపొందించిన కంపెనీలు అంగీకరించాయి. అయితే, జీఏవో పరిశోధన పద్ధతులను మాత్రం సవాలు చేశాయి. ఏదేమైనా, ఏఐ సాంకేతికత భద్రత విషయంలో మరింత కఠినమైన నిబంధనలు అవసరమనే వాదనకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

దమ్ముంటే నాపై పోటీ చేయ్

(మొదటి తరువాయి)

మీడియాతో మాట్లాడారు. సిద్దిపేట సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగం మొత్తం అబద్ధాలు, విమర్శలతోనే సాగిందని ఆరోపించారు. ప్రజల కోసం ప్రకటించిన జీవిత బీమా, ప్రమాద బీమా పథకాల గురించి మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, తన పేర్లను ప్రస్తావించడానికే ఎక్కువ సమయం కేటాయించారని విమర్శించారు. గంటసేపు సాగిన ప్రసంగంలో కేసీఆర్ పేరును 63 సార్లు, కేటీఆర్ పేరును 24 సార్లు, తన పేరును 53 సార్లు ప్రస్తావించారని హరీశ్‌రావు తెలిపారు. మొత్తం 140 సార్లు తమ పేర్లు తలుచుకున్నారని పేర్కొన్నారు. తనను తాటిబెట్టుతో పోల్చిన రేవంత్‌రెడ్డిని గన్నేరు చెట్టుతో పోలుస్తున్నానని వ్యాఖ్యానించారు. కుట్రలు చేయడం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేదని విమర్శించారు. ఆయన ప్రసంగంలో అబద్ధాలు, విమర్శలు తప్ప ప్రజలకు ఉపయోగపడే అంశాలు లేవని మండిపడ్డారు. సిద్దిపేట సభకు ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ విషయాన్ని సిద్దిపేట కమిషనరే తనకు చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణ సాగునీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగిస్తున్నారని, చంద్రబాబు జలదోపిడీకి రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడిన 40 రోజుల్లోనే కృష్ణా జలాల పునఃపంపిణీ చేపట్టాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా జలాల విషయంలో ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపించడం లేదని అన్నారు. నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవని ముఖ్యమంత్రి చెప్పడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేవాదుల వద్ద మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి నీటిని ఎందుకు ఎత్తిపోసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ పాలన బాగోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బహిరంగంగా మాట్లాడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అందుకోవచ్చని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కొత్త పథకాలు ప్రకటించడం కంటే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలనైనా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సుభిక్షంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం కరువు పరిస్థితుల్లోకి నెట్టిందని విమర్శించారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డి చేస్తున్న అన్యాయాన్ని ఆధారాలతో సహా ప్రజలకు వివరిస్తానని హరీశ్‌రావు అన్నారు. దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి, మైక్ కట్ చేయకుండా చర్చకు అవకాశం కల్పించాలని సవాల్ విసిరారు. మూడు రోజులైనా, నాలుగు రోజులైనా చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. ప్రతి అంశంపై ఆధారాలతో మాట్లాడతానని చెప్పారు. అసెంబ్లీలో సాగునీటి అంశంపై పాయింట్లవారీగా చర్చ జరగాలని డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు కాంగ్రెస్, చంద్రబాబే ద్రోహం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. మూడు దశాబ్దాల పాటు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీటి కష్టాలను తీర్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కనీసం అర కిలోమీటరు కాలువ కూడా తవ్వలేదని ఆరోపించారు. 50 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కోల్పోయిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నీటి ప్రాజెక్టులతో ముందుకెళ్తుంటే, తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీళ్లు అందించడంలో విఫలమైందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని హరీశ్‌రావు జోస్యం చెప్పారు.

మహిళలను అవమానిస్తే సహించేది లేదు

(మొదటి తరువాయి)

ఇప్పుడు విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి చేసిన 'సిగ్గుండాలి' వ్యాఖ్యలపై సీతక్క తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలు మహిళలను వ్యక్తిగతంగా అవమానించే స్థాయికి దిగజారకూడదని హితవు పలికారు. మహిళల ఆత్మగౌరవం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోనని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ చెప్పే సంస్కారం ఇదేనా? అంటూ బీఆర్ఎస్ నాయకత్వాన్ని నిలదీశారు.

యోగి ఆదిత్యనాథ్ తల్లి సావిత్రి దేవి కన్నుమూత



న్యూఢిల్లీ:
ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి సావిత్రి దేవి (91) ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్ జిల్లాలో ఉన్న స్వగ్రామం పంచూర్‌లోని నివాసంలో కన్నుమూశారు. వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సావిత్రి దేవి మరణవార్తను పౌరీ గఢ్వాల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి సర్వేశ్ పన్వార్ ధ్రువీకరించారు. ఆమె భౌతికకాయానికి హరిద్వార్‌లో అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉందని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పోలీసు, జిల్లా యంత్రాంగం కుటుంబ సభ్యులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో అనారోగ్యానికి గురైనప్పుడు ఆమెకు రిషికేశ్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. సావిత్రి దేవి మృతిపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తల్లి ప్రేమ, ఆశీస్సులు వెలకట్టలేనివని, ఆమె మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని యోగి ఆదిత్యనాథ్ కుటుంబానికి ప్రసాదించాలని ప్రార్థించారు. మరోవైపు తల్లి మరణవార్త తెలిసినప్పటికీ యోగి ఆదిత్యనాథ్ ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గోరఖ్‌పూర్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరై తన విధులను కొనసాగించారు.

ఆత్మీయతకు చిరునామాగా మందడి సరోజ్ రెడ్డి..

-చిన్నవడ్డెమాన్‌లో వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులకు ఆశీస్సులు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ నవంబర్ 20 మహాప్రభ

చిన్నచింతకుంట: ఆప్యాయతతో పలకరించడం.. ఆత్మీయతతో పలకరింపులు అందుకోవడం.. సంతోష సమయాల్లో తోడుగా నిలవడం.. ఇవే ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే నాయకత్వ లక్షణాలు. పదవులు, హోదాలకు అతీతంగా ప్రజలతో మమేకమవుతూ ఆత్మీయ అనుబంధాలకు ప్రాధాన్యతనిచ్చే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి మరోసారి తన ఆత్మీయతను చాటుకున్నారు. దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డెమాన్ గ్రామానికి చెందిన యం.



చంద్రశేఖర్ వివాహ వేడుకకు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పరస్పర ప్రేమానురాగాలతో నిండాలని ఆకాంక్షించారు.

వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించడం ద్వారా కుటుంబ సభ్యులతో తన ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు. సంతోషకరమైన సందర్భాల్లో కుటుంబ సభ్యుల మధ్యకు వచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం ఆయనలోని మానవీయ కోణానికి, బంధాలకు ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలిచింది.

ప్రజా జీవితంలో ఎంతటి బాధ్యతల్లో ఉన్నప్పటికీ, మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు మరువకుండా ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండటమే నిజమైన నాయకత్వానికి నిదర్శనం. ఈ సందర్భంగా మందడి సరోజ్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించడం అక్కడి కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది.

ఆత్మీయతతో పలకరించే మనసు.. ఆప్యాయతతో అండగా నిలిచే వ్యక్తిత్వం.. ప్రజలతో మమేకమయ్యే నాయకత్వం.. మందడి సరోజ్ రెడ్డి ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పాయి.

కోయిల్‌సాగర్ నీటిని కొడంగల్‌కు తరలిస్తే సహించేది లేదు

రైతుల సాగునీటి హక్కులే మాకు ముఖ్యం.. స్థానిక ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరిచ్చాకే ఇతర ప్రాంతాలకు కేటాయించాలి: కొండ ప్రశాంత్‌రెడ్డి

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి తరలింపు ప్రతిపాదనపై బీజేపీ నేతల నిలదీత.. ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు

మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర: నియోజకవర్గం నవంబర్ 20 మహాప్రభ

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిని కొడంగల్‌కు తరలించాలన్న ప్రతిపాదనపై దేవరకద్ర ప్రాంతంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక రైతుల సాగునీటి అవసరాలను పక్కనపెట్టి ఇతర ప్రాంతాలకు నీటిని కేటాయించడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని దేవరకద్ర బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి తరలింపుపై ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ మేరకు కొండ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో నీటి నిల్వలు, ఆయకట్టు పరిస్థితి, నీటి కేటాయింపులు, అధికారిక అనుమతులపై పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు.

రైతుల కోసం నిర్మించిన ప్రాజెక్టు.. ఇతర ప్రాంతాలకు నీటి తరలింపుపై అభ్యంతరం

కోయిల్‌సాగర్ ప్రాజెక్టును ప్రధానంగా ఈ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు నిర్మించారని కొండ ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. అలాంటి ప్రాజెక్టు నుంచి రోజుకు 40 ఎంఎల్‌డీల (4 కోట్ల లీటర్లు) నీటిని కొడంగల్‌కు తరలించాలన్న ప్రతిపాదన స్థానిక రైతుల్లో ఆందోళనకు కారణమవుతోందన్నారు. ముందుగా ప్రాజెక్టు పరిధిలోని రైతులకు పూర్తిస్థాయిలో నీరందించకుండా ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తగ్గుతున్న నీటి నిల్వలు.. నీటి కేటాయింపులపై స్పష్టత ఏది?

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 2.276 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 1.15 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే నీటి నిల్వలు 0.95 టీఎంసీలు తగ్గాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రోజుకు 40 ఎంఎల్‌డీల చొప్పున



నీటిని తరలిస్తే ఏడాదికి సుమారు 0.516 టీఎంసీల నీరు అవసరమవుతుందని వివరించారు. స్థానిక రైతుల అవసరాలకే సరిపడా నీరు లేని పరిస్థితుల్లో అదనపు నీటిని ఏ వనరు నుంచి సమకూరుస్తారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

12 వేల ఎకరాల ఆయకట్టుకే పూర్తిస్థాయిలో నీరందడం లేదు

ప్రాజెక్టు అసలు ఆయకట్టు 12 వేల ఎకరాలు కాగా, సగటున కేవలం 5 వేల ఎకరాలకే సాగునీరు అందుతోందని అధికారిక గణాంకాలను ప్రస్తావించారు. మరోవైపు కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా 50,250 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం ఉందని గుర్తుచేశారు. ఆ లక్ష్యం ఎంతవరకు నెరవేరింది? మిగిలిన ఆయకట్టుకు నీరందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కొండ ప్రశాంత్‌రెడ్డి కోరారు.

లగచర్ల పరిశ్రమలకు 15 ఎంఎల్‌డీలు.. రైతులకు ఎంత నీరు?

ప్రతిపాదిత 40 ఎంఎల్‌డీల నీటిలో 15 ఎంఎల్‌డీలను లగచర్ల పారిశ్రామిక కారిడార్‌కు కేటాయించినట్లు సమాచారం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మొత్తం నీటి కేటాయింపుల్లో 32 ఎంఎల్‌డీల వినియోగ వివరాలే స్పష్టంగా కనిపిస్తున్నాయని, మిగిలిన 8 ఎంఎల్‌డీలను ఎక్కడ, ఏ అవసరాలకు వినియోగిస్తారో ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. పరిశ్రమలకు నీటి కేటాయింపులపై చూపుతున్న శ్రద్ధ స్థానిక రైతుల సాగునీటి అవసరాలపై కూడా చూపాలని సూచించారు.

ముందుగా స్థానిక సమస్యలు పరిష్కరించాలి

కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో పూడికతీత, కాలువల ఆధునికీకరణ, చివరి ఆయకట్టుకు నీటి సరఫరా వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందని కొండ ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులకే సక్రమంగా నీరందించలేని పరిస్థితుల్లో కొత్తగా నీటి తరలింపు ప్రతిపాదనలు తీసుకురావడం సరికాదన్నారు. సాగునీటి వ్యవస్థను పటిష్టం చేసి, నిర్దేశిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి బీజేపీ సూటి ప్రశ్నలు

కోయిల్‌సాగర్ నుంచి కొడంగల్‌కు నీటిని తరలించేందుకు అధికారిక అనుమతులు ఉన్నాయా? నీటి కేటాయింపులపై ఉత్తర్వులు జారీ చేశారా? నీటి లభ్యతపై సాంకేతిక అధ్యయనం నిర్వహించారా? స్థానిక ఆయకట్టు అవసరాలు తీరిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తుందా? అనే ప్రశ్నలను బీజేపీ నాయకులు సంధించారు. వీటిపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి వ్యతిరేకం కాదు.. రైతుల హక్కుల విషయంలో రాజీ లేదు

ఈ సందర్భంగా కొండ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "మాకు అభివృద్ధిపై ఎలాంటి వ్యతిరేకత లేదు. కొడంగల్‌కు తాగునీరు అందించడం అవసరమే. పరిశ్రమలు రావడం, పారిశ్రామిక అభివృద్ధి జరగడం కూడా స్వాగతించాల్సిన విషయాలే. అయితే ఆ అభివృద్ధి కోసం దేవరకద్ర ప్రాంత రైతుల సాగునీటి ప్రయోజనాలను బలిపెట్టడం మాత్రం సమంజసం కాదు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు స్థానిక రైతుల అవసరాలను తీర్చేందుకే నిర్మించారు. ముందుగా అసలు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించాలి. విస్తరణ ఆయకట్టు లక్ష్యాన్ని నెరవేర్చాలి. స్థానిక రైతుల సాగునీటి హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలి. ఆ తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటి కేటాయింపులపై ముందుకెళ్లాలి. రైతుల ప్రయోజనాలను విస్మరించే ఏ నిర్ణయాన్నైనా మేము ప్రశ్నిస్తాం" అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యజ్ఞభూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, ఓబీసీ కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, స్థానిక బీజేపీ కౌన్సిలర్ ఉమారాజ్, మండల ప్రధాన కార్యదర్శులు కొండ అనిల్‌కుమార్, కృపాకర్‌గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మండ్ల వెంకటేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మండల మైనార్టీ మోర్చా అధ్యక్షుడు సమీర్‌తో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోయిల్‌సాగర్ నీటి కేటాయింపులపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, స్థానిక రైతుల సాగునీటి హక్కులకు భరోసా కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

దేవరకద్ర సమగ్ర అభివృద్ధికి 15 ఏళ్ల మాస్టర్ ప్లాన్.. డీపీఆర్ సిద్ధం

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణ రూపురేఖల్లో మార్పులు -- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 20 మహాప్రభ

దేవరకద్ర: దేవరకద్ర పట్టణ సమగ్ర అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాబోయే 15 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మాస్టర్ ప్లాన్‌తో పాటు సమగ్ర వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించారు.

ఈ మేరకు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసి రూపొందించిన మాస్టర్ ప్లాన్, డీపీఆర్‌ను వివరించారు. పట్టణ భవిష్యత్ అవసరాలు, ప్రతిపాదిత అభివృద్ధి పనులను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. రాబోయే 15 ఏళ్లలో పెరగనున్న



జనాభా, పట్టణ విస్తరణను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు డీపీఆర్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. పట్టణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించడంతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి స్వల్పకాలిక చర్యలతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాలకే పరిమితం కాకుండా రాబోయే 15 ఏళ్లలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ముందుగానే అంచనా వేసి ఈ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

దేవరకద్ర సమగ్ర అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్, డీపీఆర్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖల ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి దేవరకద్రను ప్రణాళికాబద్ధమైన ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఎం డి. మందిర్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



దేవరకొండ నవంబర్ 20,(మహా ప్రభ)

దేవరకొండ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మందిర్ పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.గురువారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....మైనంపల్లి నుంచి దేవరకొండ పట్టణానికి పాఠశాలను మార్చేందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. అనుమతులు లేకుండా పాఠశాలను మార్చి నిర్వహిస్తున్న యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే ఎం.డి.మందిర్ పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయడంతో పాటు, బాధ్యులైన యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పర్సనల్ సెక్రటరీ బుచ్చన్న నాయుడు కుమార్తె వివాహ వేడుకలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు!!

-కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆత్మీయంగా గడిపిన ఎమ్మెల్యే దంపతులు!!



వనపర్తి నవంబర్ 20 మహాప్రభ

వనపర్తి పట్టణంలోని శ్రీ లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పర్సనల్ సెక్రటరీ పిఎస్ బుచ్చన్న నాయుడు కుమార్తె వివాహ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తన సతీమణి శారదారెడ్డి తో కలిసి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు నూతన వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు బంధుమిత్రులతో కలిసి సరదాగా ఫొటోలు దిగుతూ, దంపతులిద్దరూ ఆత్మీయ పలకరింపులతో పెళ్లి వేడుకలో సందడి చేశారు తమ కుటుంబంలో జరిగే శుభకార్యానికి ఎమ్మెల్యే దంపతులు స్వయంగా వధూవరులను ఆశీర్వదించడంతో బుచ్చన్న నాయుడు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరె రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వివిధ మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-ఎంపీడీఓ డానీయల్



దేవరకొండ నవంబర్ 20 (మహాప్రభ)

ఇందిరమ్మ జీవిత కుటుంబ భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎంపీడీవో డానియల్ అన్నారు శుక్రవారం మైనంపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ నాయక్ అధ్యక్షతన ప్రజలకు ఈ పథకంపై అవగహన కొరకు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి రమావత్ సాగర్ పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్ ఉపసర్పంచ్ లాలూ నాయక్ పాలకవర్గ సభ్యులు కోర్ర లక్ష్మి పులిజాల వెంకట్ కోర్ర కిషన్ నాయక్ పులిజాల నాగరాజు అంగన్వాడీ టీచర్లు కమలమ్మ. లచ్చి బుజ్జి. ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి జగదీష్ ఆశా కార్యకర్త ధనమ్మ అలివేలు ఫీల్డ్ అసిస్టెంట్ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే మంచి ఫలితం ఉంటుంది

-మెడికల్ సీటు సాధించిన భవ్యశ్రీకి సత్కారం శాలువాలతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే!!..

-ఉన్నత చదువులతో తల్లిదండ్రులకు, కన్న ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్ష



వనపర్తి నవంబర్ 20 మహాప్రభ

ఆసిఫాబాద్‌లో మెడికల్ సీటు సాధించిన పెద్దమందడి మండలం మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన బోయిని భవ్యశ్రీని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారుబి ఈ సందర్భంగా విద్యార్థిని భవ్యశ్రీని శాలువాలతో సత్కరించి ఆమె సాధించిన విజయాన్ని ప్రశంసించారు. మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ అన్న న శివ యాదవ్, పద్మ దంపతుల కుమార్తె భవ్యశ్రీ మెడికల్ సీటు సాధించడం పట్ల ఎమ్మెల్యే విద్యార్థినిని అభినందించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవ్యశ్రీ ఉన్నత చదువులు అభ్యసించి వైద్య రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు కన్న ఊరికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాపరంగా ఎలాంటి అవసరాలు, సహకారం కావాలన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, బాలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సమగ్ర తనిఖీ రికార్డుల పరిశీలన
సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీనివాసరావు



దేవరకొండ, నవంబర్ 20:(మహాప్రభ)

దేవరకొండ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎం.వి. శ్రీనివాసరావు శుక్రవారం దేవరకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, కేసు రికార్డులు, స్టేషన్ డైరీ, అరెస్ట్ రిజిస్టర్, ప్రిజనర్ రిజిస్టర్‌తో పాటు ఇతర అధికారిక రికార్డులను పరిశీలించారు.

కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, నివేదికల సమర్పణ, కోర్టు డైరీ ప్రక్రియలు, రికార్డుల నవీకరణపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది విధుల నిర్వహణ, పనితీరు, క్రమశిక్షణ, యూనిఫారం, వ్యక్తిగత రికార్డులు, డ్యూటీ చార్ట్‌లను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సమయానికి, వినయపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు. సి.సి.టి ఎన్.ఎస్. పోర్టల్‌లో ఎఫ్ఐఆర్‌ల నమోదు, కేసుల వివరాలు, అరెస్ట్, సీజ్, ఛార్జ్‌షీట్ వివరాలు, కోర్టు తీర్పులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఖచ్చితంగా అప్‌డేట్ చేయాలని సూచించారు. డేటా నిర్వహణలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పోలీస్ స్టేషన్ భవనం, వాహనాలు, వైర్‌లెస్ సౌకర్యాలు, కంప్యూటర్ వ్యవస్థలు, సైబర్ సెల్ కార్యకలాపాలు, మహిళా సహాయక డెస్క్, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను కూడా పరిశీలించారు. అవసరమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో స్వీకరించి తక్షణమే స్పందించాలని, మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు సిబ్బందికి సూచించారు. నేరాల నివారణ, దొంగతనాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల సహకారంతో మెరుగైన పోలీసింగ్ అందించాలని ఎస్‌డీపీఓ ఎం.వి. శ్రీనివాసరావు ఆదేశించారు.

మున్సిపాలిటీ కార్మికులకు పూర్తి భద్రత కల్పించాలి
సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య



దేవరకొండ, నవంబర్ 20:(మహాప్రభ)

నల్లగొండ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసి, కులం పేరుతో దుర్భాషలాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులపై దాడులు చేయడం, కులం పేరుతో అవమానించడం వంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విధులు నిర్వహించే సమయంలో మున్సిపల్ కార్మికులకు పూర్తి భద్రత కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని నల్ల వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వాడపల్లి యాదగిరి, మున్సిపల్ కార్మికులు పొట్ట తారమ్మ, పొట్ట ముత్తమ్మ, అంకురి విజయ, వసుకుల వెంకటమ్మ, అంకురి మల్లమ్మ, ఎసోబు. చిత్రం మల్లమ్మ, సురేష్, అంకురి శ్రీకాంత్, అంకురి బిక్షపతి, ప్రశాంత్, అంకురి రాంబాబు, సందగళ్ల లక్ష్మయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే





-జర్నలిస్టుల ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

-ఇళ్ళస్థలాల సాధనకై ధర్నా చేసిన జర్నలిస్టులు

హైదరాబాద్, నవంబర్ 20,(మహా ప్రభ)

జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల పోరాటానికి తన మద్దతు ఉంటుందని,ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకై గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, పేద ప్రజల మాదిరిగా జర్నలిస్టులు కూడా పేదలేనని, వీరికి కూడా ప్రభుత్వం ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరారు. ధర్నా కు అధ్యక్షత వహించిన సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కోసం 18 ఏళ్ళుగా సొసైటీ పోరాడుతుందని, గత ప్రభుత్వాలు ఇళ్ళస్థలాలు ఇవ్వకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ళు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టు సంఘం పేరుతో కొందరు సోకాల్డ్ జర్నలిస్టు నాయకులు తమ సొసైటీ పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి చర్యలను సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షురాలు హేమ సుదర్శన్, జై స్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్ గౌడ, టీజేఎస్ అధికార ప్రతినిధి సలీమ్ పాషా, నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు ఆనంచిన్ని వెంకటేశ్వర రావు, ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్,సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, సీనియర్ మహిళా జర్నలిస్టు ప్రియా చౌదరి తదితరులు పాల్గొని ధర్నాకు మద్దతు తెలియజేస్తూ ప్రసంగించారు. ఇంకా ఈ ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కుంచం శ్రీనివాస్, వి. రవికుమార్, ఎం. రవికుమార్,సొసైటీ డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, వీరేశం, మహిళా జర్నలిస్టులు సీబీ లక్ష్మీ, నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
ప్రతికుటుంబానికి రూ.5 లక్షల భరోసా

-నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శిహనుమంతు వెంకటేష్ గౌడ్.

దేవరకొండ డివిజన్ నవంబర్ 20 (మహాప్రభ)

తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతికుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలుచేసేందుకుముందుకు వచ్చింది.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమ దార్శనికతతో ప్రజలకు మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.బీమా మొత్తం: అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా రక్షణ.

వయస్సు: 18--59సంవత్సరాల వయస్సు గల ఉపాధి పొందే కుటుంబ సభ్యులకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయి.ఎవరికివర్తిస్తుంది?ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది.నామినీ: బీమా పొందే వ్యక్తి నామినీ వివరాలను.నమోదు



చేయించుకోవాలి.గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ కార్యాలయం, గ్రామస్థాయి అధికారులు, సంబంధిత ప్రత్యేక నమోదు కేంద్రాల్లో నంవ్రదించాలి.వట్టణప్రాంతాల్లోమున్సివల్ కార్యాలయంలేదాప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక నమోదు కేంద్రాల్లో వివరాలు తెలుసుకోవాలి.ప్రభుత్వం ప్రకటించే నమోదు తేదీలు, అధికారిక మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.

అవసరమైన పత్రాలు

1.ఆధార్కార్డు.2.రేషన్ కార్డు3. బీమా పొందే వ్యక్తివివరాలు4. నామినీ వివరాలు5. మొబైల్ నంబర్అర్హులైన ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి!

ఈ పథకంపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించండి. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేసుకుని ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఒక కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచే రూ. 5 లక్షల ఆర్థిక భరోసా.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపథకం.కాంగ్రెస్ ప్రభుత్వం.ప్రజలసంక్షేమమే లక్ష్యం!

కార్మికుల పోరాటంతోజీతం
రూ. 20 వేలకు పెంపు: రమేష్

వనపర్తి నవంబర్ 20 మహాప్రభ

ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల ఎనిమిది రోజుల పోరాటం ఫలితంగా ప్రభుత్వం వేతనం రూ. 20 వేలకు పెంచిందని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. జీతాలు పెంచిన నేపథ్యంలో వనపర్తి జిజిహెచ్, ఎం సి హెచ్ వద్ద కార్మికులు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జీతాలు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద కార్మికులుచేస్తున్న ఆందోళన నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నేతలు తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) వాణితో జరిపిన చర్చల ఫలితంగా గతంలో ఉన్న రూ. 11,500 వేతనాన్ని రూ. 20243కు పెంచారన్నారు. జిపిఎఫ్ షేర్ కింద రూ. 1800, ఈఎస్ఐ షేర్ కింద రూ. 152 రూపాయలు కట్టింగ్ పోను కార్మికుడికి నెలవేతనం రూ.





18291 చేతికి అందుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే కనీస వేతనం రూ. 26 వేల కోసం పోరాడాల్సి ఉందన్నారు. సంవత్సరానికి నాలుగు పండుగ సెలవులు, నాలుగు జాతీయ దినోత్సవాల సెలవులతో పాటు వేతనంతో కూడిన 20 సెలవులు ఇవ్వాలని, రెండు జతలు బట్టలు ఇవ్వాలని, ఒక నెల బోనస్ ఇవ్వాలన్న డిమాండ్లు అలాగే ఉన్నాయని, త్వరలోనే యూనియన్ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటామని డి ఎం ఈ హామీ ఇవ్వటంతో ఎనిమిది రోజుల ఆందోళన తాత్కాలికంగా విరమించడం జరిగిందన్నారు. పెండింగ్లో ఉన్న హామీలు పరిష్కారం కాకుంటే న్యాయమైన డిమాండ్ల కోసం మళ్లీ పోరాటం తప్పదని హెచ్చరించారు. జీతాలు పెంచిన ప్రభుత్వానికి, డిఎన్ఇ వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి కార్మికులు నేతలు కృతజ్ఞతలు తెలిపారు.యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీను, నరసింహ, నరేందర్, కృష్ణ, మోహన్, కుమార్, లక్ష్మి, మహేష్, ఖదీర్, శ్రీహరి, భాగ్యమ్మ, పెంటమ్మ, శాంతి కవిత రాణి, రూబీనా, పుష్ప తదితరుల పాల్గొన్నారు

వనస్థలిపురంలో వృద్ధుడు అదృశ్యం

-మూడు రోజులుగా ఆచూకీ లభించక ఆందోళనలో కుటుంబ సభ్యులు

వనస్థలిపురం, నవంబర్ 20 మహాప్రభ

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్న 67 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో వనస్థలిపురం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం కొండకిందిగూడెం గ్రామానికి చెందిన గౌరరపు లింగయ్య అలియాస్ ముత్తయ్య (67) గత కొంతకాలంగా వనస్థలిపురంలోని గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మాంగల్య షాపింగ్ మాల్ సమీపంలోని వెంకటేశ్వర బార్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల



16వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బార్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన లింగయ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య గౌరరపు వెంకటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వృద్ధుడి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీలలో పేట్ సంగం విద్యార్థుల ప్రతిభ

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న శశాంక్, వేదశ్రీ



గాంధారి నవంబర్ 20 (మహాప్రభ)
భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో గాంధారి మండలం పేట్ సంగం జెడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులు విజయం సాధించారు.వ్యాసరచనలో ద్వితీయ స్థానం పొందిన శశాంక్, క్విజ్ పోటీలో విజయం సాధించిన వేదశ్రీ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.వారిని మండల తహసీల్దార్ రేణుక చౌహన్, మండల విద్యాధికారి శ్రీహరి, ప్రధానో పాధ్యాయులు కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యా యులు, గైడ్ గా వ్యవహరించిన బండి రాజులు, లింగమయ్య, గ్రామ ప్రజలు అభినందించారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్ల తొలగింపు

-వెంటనే స్పందించిన ఎస్.ఐ మహేందర్



గాంధారి నవంబర్ 20 (మహాప్రభ)
గాంధారి మండలంలోని బూర్గుల్ కి వెళ్లే రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను గాంధారి ఎస్.ఐ మహేందర్ ఆధ్వర్యంలో తొలగించారు. బుర్గుల్, బొప్పాజీ వాడి గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా ఎండిపోయిన చెట్లు పడిపోయాయి. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.
వెంటనే ఎస్.ఐ మహేందర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

చినరాజమూరు ఆంజనేయస్వామి ఆలయానికి రూ.17.12 లక్షల ఆదాయం

-వార్షిక వేలంపాటల్లో భక్తుల ఉత్సాహం..
- టెంకాయల కాంట్రాక్టుకు రూ.4.02 లక్షలు

దేవరకద్ర నవంబర్ 20 మహాప్రభ
మండలంలోని చినరాజమూరు గ్రామ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక వేలంపాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దేవస్థాన ఈవో శ్యాంసుందర్ ఆచారి, ప్రధాన అర్చకులు భీమేష్ చారి ఆధ్వర్యంలో వేలంపాటలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, వేలంపాటదారులు ఉత్సాహంగా పాల్గొని ఆలయానికి సంబంధించిన వివిధ ఆదాయ వనరులను దక్కించుకున్నారు.





వేలంపాటలో టెంకాయల విక్రయ హక్కును శ్రీనివాసులు రూ.4,02,000కు దక్కించుకోగా, తలనీలాల వేలంపాటను కోన రాజశేఖర్ రూ.7,71,000కు సొంతం చేసుకున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయ హక్కును నత్తి కురుమయ్య రూ.3,65,000కు, కొబ్బరి చిప్పల వేలంపాటను హనుమంతు రూ.1,74,000కు దక్కించుకున్నారు. ఈ నాలుగు వేలంపాటల ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.17,12,000 ఆదాయం సమకూరింది.

చినరాజమూరు ఆంజనేయస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నిత్యానంద చారి
శ్యాంసుందర్ చారికి మరో దేవస్థానం బాధ్యతలు
దేవరకద్ర: మండలంలోని చినరాజమూరు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణ అధికారిగా మక్తల్‌లోని శ్రీ పడవటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో కె. నిత్యానంద చారి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం (20-11-2026) ఆయనకు బాధ్యతలు అప్పగించారు.
ఇప్పటివరకు చినరాజమూరు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహించిన శ్యాంసుందర్ చారి కాకర్లపాడులోని శ్రీ మైసమ్మ దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టారు. పరిపాలనా మార్పుల్లో భాగంగా ఈ బాధ్యతల బదిలీ జరిగింది.

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

- లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ రవికుమార్

ఎల్బీనగర్, నవంబర్ 20 మహాప్రభ
ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిపై సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నియోజకవర్గ చైర్మన్ ఊరుపక్క రవికుమార్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న చంపాపేటలో పేదలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే అడ్డంకులు సృష్టిస్తూ మహిళలు, వికలాంగులు, వితంతువులు, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేశారని ఆయన ఆరోపించారు. అధికారులను, పోలీసులను బెదిరించడంతో పాటు తనను దూషించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దేరంగుల కృష్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోయిల్ సాగర్ రైతుల పొట్టకొడితే ఊరుకునేది లేదు





-కొడంగల్‌కు నీటి తరలింపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలి..
- లేదంటే రైతులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తాం
-ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా..
- ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గట్టి హెచ్చరిక

మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర: నియోజకవర్గం నవంబర్ 20 మహాప్రభ
కోయిల్ సాగర్ ప్రాజెక్టు నీటిని కొడంగల్‌కు తరలించాలన్న ప్రతిపాదనపై దేవరకద్రలో రాజకీయ వేడి రాజుకుంది. ఇప్పటికే సాగునీటి కోసం అల్లాడుతున్న కోయిల్ సాగర్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి, మరో ప్రాంతానికి నీటిని తరలించే ప్రయత్నాలు చేయడంపై బీఆర్ఎస్ భగ్గుమంది. రైతుల సాగునీటి హక్కులను కాపాడేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేస్తూ దేవరకద్ర మండలంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.
'సీఎం నియోజకవర్గం కోసం కోయిల్ సాగర్ రైతుల కడుపు కొట్టొద్దు.. మా రైతుల నీళ్లను ముట్టుకుంటే సహించేది లేదు' అంటూ ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గట్టి హెచ్చరిక జారీ చేశారు. కొడంగల్‌కు నీటి తరలింపు ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

20 రోజుల క్రితమే హెచ్చరించాం.. ఇప్పుడు టెండర్ల దాకా తీసుకొచ్చారు
ధర్నా అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
"కోయిల్ సాగర్ విషయంలో ఏదో కుట్ర జరుగుతోందని 20 రోజుల క్రితమే హెచ్చరించాం. కోయిల్ సాగర్ నుంచి కొడంగల్‌కు నీటిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్పష్టంగా చెప్పాం. ఇప్పుడు మా అనుమానాలే నిజమయ్యాయి. నీటి తరలింపునకు సంబంధించి టెండర్లు కూడా పిలిచారు. టెండర్లు పిలిచి తొమ్మిది రోజులు గడిచినా స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం లేదనడం విడ్డూరంగా ఉంది. బీఆర్ఎస్ ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన తర్వాతే ఎమ్మెల్యే స్పందించడం చూస్తుంటే పరిస్థితి అర్థమవుతోంది" అని ఆల వెంకటేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు.
రైతుల ప్రయోజనాలే ముఖ్యమైతే ఈ ప్రతిపాదన ముందుకు వచ్చేదే కాదని అన్నారు. ఇప్పటికే కోయిల్ సాగర్‌పై సాగునీటి అవసరాల ఒత్తిడి అధికంగా ఉందని, వర్షాకాలంలోనూ రైతులకు



పూర్తిస్థాయిలో నీళ్లు అందించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండిన పంటలు.. కన్నీళ్లు పెట్టుకున్న రైతులు.. అయినా ప్రభుత్వానికి కనికరం లేదా
ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆల వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి రైతులు కంటతడి పెట్టుకున్నారని, అలాంటి సమయంలో కోయిల్ సాగర్ నీటిని ఇతర ప్రాంతాలకు తరలించాలనుకోవడం ఆయకట్టు రైతులకు అన్యాయం చేయడమేనని అన్నారు.
"కోయిల్ సాగర్ ఆయకట్టు రైతులు ఇప్పటికే ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. వారి పంటలకు నీళ్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాంటిది ఉన్న నీటిని కూడా వేరే ప్రాంతానికి తరలిస్తామంటే రైతుల పరిస్థితి ఏంటి? కోయిల్ సాగర్ రైతులు రోడ్డున పడే పరిస్థితి తీసుకురావద్దు. ముఖ్యమంత్రి గారు ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు.

కొడంగల్‌కు తాగునీరు వద్దనడం లేదు.. కోయిల్ సాగర్‌కు అన్యాయం చేయొద్దు
కొడంగల్ ప్రజల తాగునీటి అవసరాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే అందుకోసం కోయిల్ సాగర్ ఆయకట్టు రైతుల సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆల స్పష్టం చేశారు.
మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా కొడంగల్ తాగునీటి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోయిల్ సాగర్ నిండేందుకు కరివెన రిజర్వాయర్ నుంచి కాలువ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూపకల్పన చేశామని గుర్తుచేశారు.
"కొడంగల్‌కు తాగునీరు అందించండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ కోయిల్ సాగర్‌కు బొక్క పెట్టి, ఇక్కడి రైతుల సాగునీటిని తరలించొద్దు. ఒక ప్రాంత ప్రజల అవసరాలు తీర్చే పేరుతో మరో ప్రాంత రైతుల పొట్ట కొట్టడం న్యాయం కాదు. అభివృద్ధి అంటే ఒకరికి నీళ్లిచ్చి మరొకరి పంటలు ఎండగట్టడం కాదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఇసుక దోపిడీపై ఉన్న శ్రద్ధ.. రైతులకు నీళ్లివ్వడంలో ఏది?
స్థానికంగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపైనా మాజీ ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. వాగుల్లో ఇసుక దోపిడీపై ఉన్న శ్రద్ధ రైతులకు సాగునీరు అందించడంలో లేదని ఆరోపించారు. పెద్ద రాజమూరులో చెక్‌డ్యామ్ ధ్వంసమైన ఘటనను ప్రస్తావిస్తూ, ఊకచెట్టు వాగు, పెద్దవాగుల్లో ఇసుక తవ్వకాలతో ప్రభుత్వ సంపదకు నష్టం జరుగుతోందని విమర్శించారు.
చెక్‌డ్యామ్ ధ్వంసం ఘటనలో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కేసు నమోదైనప్పటికీ అరెస్టుల విషయంలో పురోగతి ఏమిటని నిలదీశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు రాజకీయ ఆరోపణలు, కేసుల వ్యవహారాలకే పరిమితమవుతున్నారని విమర్శించారు.

ఒక్క చుక్క నీరు కూడా తరలించనివ్వం.. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం!
కోయిల్ సాగర్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా తరలించనివ్వబోమంటూ ఎమ్మెల్యే చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. అయితే మాటలకు చేతలకు పొంతన ఉండాలని, టెండర్ల దశకు చేరుకున్న ప్రతిపాదనను అడ్డుకుని ప్రభుత్వంతో విరమింపజేయాలని డిమాండ్ చేశారు. "ఇప్పుడు మాటలు చెప్పడం కాదు.. ఆ ప్రతిపాదనను ఆపించాలి. రైతులకు స్పష్టమైన భరోసా ఇవ్వాలి. కోయిల్ సాగర్ ఆయకట్టు రైతుల ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తాం. అవసరమైతే ఎంతదూరమైనా పోరాటం చేస్తాం. కోయిల్ సాగర్ రైతుల సాగునీటి హక్కుల కోసం మా పోరాటం ఆగదు" అని ఆల వెంకటేశ్వర్ రెడ్డి తేల్చిచెప్పారు.

రైతుల ప్రయోజనాలే మా పోరాట ఎజెండా
కోయిల్ సాగర్ ఆయకట్టు రైతుల సాగునీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రాజెక్టు వద్ద జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితో పాటు మాజీ సింగిల్ విండో చైర్మన్ టోకూర్ నరేందర్ రెడ్డి, జెట్టి నరసింహారెడ్డి, మున్నూరు బాల్ రాజ్, సత్యం సాగర్, మున్సిపల్ కౌన్సిలర్లు రాధా, కొండల్, మాధవి, యుగంధర్ రెడ్డి, ఉష్కిల్ల వెంకట్, రాములు, కొండారెడ్డి, కె.బి.ఆర్. గౌడ్, కోట రాములు, కౌకుంట్ల శ్రీకాంత్, రమేష్ గౌడ్, అడ్డుకురుమూర్తితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
కోయిల్ సాగర్ నీరు ఈ ప్రాంత రైతుల జీవనాధారం. ఆ నీటిపై వారి హక్కులను కాపాడటమే తమ లక్ష్యమని, రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

661 మందికి చేయూత పింఛన్లు మంజూరు.. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

-అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం -- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 20 మహాప్రభ
అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను చేరువ చేస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. కొత్తకోట మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 661 మంది వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను ఆయన అందజేశారు.
కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో నిర్వహించిన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేయిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కొత్తగా పింఛన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తోందని





పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన మహిళలు, కుటుంబానికి ఆధారంగా జీవిస్తున్న ఒంటరి మహిళలు, వైకల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు ఈ పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని అన్నారు. ప్రతి నెలా అందే పింఛన్ వారి రోజువారీ అవసరాలకు తోడ్పడటంతో పాటు ఆత్మగౌరవంతో జీవించేందుకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

అర్హులెవరూ అందోళన చెందవద్దు
సాంకేతిక కారణాలతో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు కాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సంబంధిత పత్రాలతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా కృషి చేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.

ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా
ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై మాట్లాడుతూ.. గతంలో భూమి ఉన్న రైతులకే రైతు బీమా అందేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించే దిశగా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం సంభవించినా ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.
ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

-హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరల పతనం
-24 క్యారెట్ల బంగారంపై రూ.5,120 తగ్గుదల
-రూ.1,25,570కు చేరిన 10 గ్రాముల ధర
-22 క్యారెట్ల పసిడిపై రూ.4,700 కోత
-రూ.1,15,100 వద్ద కొనసాగుతున్న ఆభరణాల బంగారం
-కిలో వెండిపై రూ.5,000 తగ్గుదల
-రూ.1,75,000కు చేరిన కిలో వెండి ధర
-ధరల తగ్గుదలతో కొనుగోలుదారులకు ఊరట



హైదరాబాద్:
బంగారం, వెండి కొనుగోలుదారులకు ఊరటనిస్తూ బులియన్ మార్కెట్‌లో ధరలు భారీగా తగ్గాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.5,120 తగ్గి రూ.1,25,570కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.4,700 తగ్గి రూ.1,15,100 వద్ద కొనసాగుతోంది.
వెండిదీ అదే బాట
బంగారంతోపాటు వెండి ధర కూడా గణనీయంగా తగ్గింది. కిలో వెండి ధర రూ.5,000 తగ్గి రూ.1,75,000కు చేరింది. వరుసగా అధిక ధరలతో ఇబ్బందిపడుతున్న కొనుగోలుదారులకు తాజా తగ్గుదల కొంత ఊరటనిస్తోంది. పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునేవారు ధరల తగ్గుదలపై ఆసక్తి చూపుతున్నారు.
జీఎస్టీ అదనం
ప్రస్తుతం ప్రకటించిన ధరలకు అదనంగా మూడు శాతం వస్తు, సేవల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. బంగారు ఆభరణాల కొనుగోలుపై తయారీ ఛార్జీలు కూడా వర్తిస్తాయి. ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.
కొనుగోలుదారులు దుకాణాల్లో తాజా ధరలను తెలుసుకున్న తర్వాత కొనుగోలు నిర్ణయం తీసుకోవాలి.

నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

-నష్టాలతో ప్రారంభమైన సూచీల ట్రేడింగ్
-ఉదయం 9.20 గంటలకు 108.90 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
-59.05 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
-82,912.85 వద్ద సెన్సెక్స్ ట్రేడింగ్
-25,455.25 వద్ద కొనసాగిన నిఫ్టీ
-బిర్లాసాఫ్ట్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ షేర్లలో లాభాలు
-వేదాంత, నేషనల్ అల్యూమినియం షేర్లలో నష్టాలు



ముంబై
దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభం నుంచే సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం 9.20 గంటల సమయానికి సెన్సెక్స్ 108.90 పాయింట్లు నష్టపోయి 82,912.85 వద్దకు చేరింది. నిఫ్టీ 59.05 పాయింట్లు తగ్గి 25,455.25 వద్ద ట్రేడయింది. మార్కెట్‌లో కొన్ని సంస్థల షేర్లు లాభాల బాట పట్టగా, మరికొన్ని నష్టాలను చవిచూశాయి. బిర్లాసాఫ్ట్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ షేర్లు లాభాల్లో కొనసాగాయి. మరోవైపు వేదాంత, నేషనల్ అల్యూమినియం కంపెనీ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా ఎయిర్‌టెల్

-అగ్రస్థానాన్ని దక్కించుకున్న టెలికాం సంస్థ
-హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కినెట్టిన ఎయిర్‌టెల్
-43.2 బిలియన్ డాలర్లకు చేరిన బ్రాండ్ విలువ
-రెండో స్థానంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
-మూడో స్థానంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్
-జాబితాలో చోటు దక్కించుకోని రిలయన్స్ జియో
-గత ఏడాదిలో 12 శాతం తగ్గిన టాప్ 100 బ్రాండ్ల మొత్తం విలువ



న్యూఢిల్లీ:
దేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటివరకు మొదటి స్థానంలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించింది. కాంతార్ విడుదల చేసిన 'బ్రాండ్‌జెడ్ 2026' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఎయిర్‌టెల్ బ్రాండ్ విలువ 43.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు పేర్కొంది.
రెండో స్థానానికి హెచ్‌డీఎఫ్‌సీ
తాజా నివేదిక ప్రకారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండో స్థానానికి పరిమితమైంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మూడో స్థానంలో నిలిచింది. దేశీయ బ్రాండ్ల మధ్య పోటీ, మార్కెట్ విలువలో మార్పులు ర్యాంకుల్లో ప్రతిఫలించాయి. మరోవైపు రిలయన్స్ జియో ఈ జాబితాలో చోటు దక్కించుకోలేదు. స్టాక్ మార్కెట్‌లో దాని లిస్టింగ్ ప్రక్రియ పూర్తికాకపోవడమే ఇందుకు కారణమని నివేదిక వివరించింది.
తగ్గిన టాప్ 100 బ్రాండ్ల విలువ
దేశంలోని అత్యంత విలువైన 100 బ్రాండ్ల మొత్తం విలువ గత ఏడాదితో పోలిస్తే 12 శాతం తగ్గినట్లు కాంతార్ నివేదిక వెల్లడించింది. మొత్తం బ్రాండ్ విలువ తగ్గినప్పటికీ ఎయిర్‌టెల్ అగ్రస్థానానికి చేరడం విశేషం. దేశీయ వ్యాపార రంగంలో బ్రాండ్ల స్థానం, వాటి విలువలో చోటుచేసుకుంటున్న మార్పులను ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

స్పోర్ట్స్

నేను 'సెహ్వాగ్ 2.0' కావడానికి రాలేదు..

-తండ్రితో పోలికపై ఆర్యవీర్ బోల్డ్ కామెంట్స్
-తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌తో పోలికపై స్పందించిన ఆర్యవీర్ సెహ్వాగ్
-తాను 'సెహ్వాగ్ 2.0' కావడానికి రాలేదని స్పష్టీకరణ
-నాన్నతో పోలిక అభిమానుల ప్రేమ మాత్రమేనని వెల్లడి
-మొదటి ఆర్యవీర్‌గా గుర్తింపు పొందడమే లక్ష్యమని వ్యాఖ్య
-అండర్-19 ఆసియా కప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో ఆర్యవీర్ కీలక పాత్ర





భారత క్రికెట్ దిగ్గజం వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ తన తండ్రితో వస్తున్న పోలికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను మరొకరి నీడలా ఉండటానికి రాలేదని, క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించడానికే వచ్చానని స్పష్టం చేశాడు. అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత జట్టును ఛాంపియన్‌గా నిలపడంలో కీలకపాత్ర పోషించిన ఆర్యవీర్, తండ్రితో పోల్చడంపై తొలిసారి మనసు విప్పి మాట్లాడాడు. "కెరీర్ ప్రారంభంలోనే నా తండ్రితో పోలికలు తప్పవనే నిజాన్ని గ్రహించాను. దాన్ని నేను ఆపలేను. మా ఇద్దరి ఆటలో ఎవరైనా పోలికలు చూస్తున్నారంటే అది వారి అభిప్రాయం. మా నాన్నపై వారికి ఉన్న ప్రేమ మాత్రమే. కానీ నేను ఇక్కడికి 'సెహ్వాగ్ 2.0' కావడానికి రాలేదు. ఆర్యవీర్ సెహ్వాగ్‌గా నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి వచ్చాను. రెండో సెహ్వాగ్‌గా నిలవడం కంటే మొదటి ఆర్యవీర్‌గా ఉండటానికే ఇష్టపడతాను" అని జియోస్టార్‌తో మాట్లాడుతూ ఆర్యవీర్ స్పష్టం చేశాడు. ఈ టోర్నమెంట్‌లో ఆర్యవీర్ అద్భుతమైన ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం 5 మ్యాచుల్లో 90.25 సగటు, 95కు పైగా స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 361 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో తీవ్ర గాయంతోనూ అద్భుత పోరాటపటిమ ప్రదర్శించాడు. 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో మోచేతికి బలమైన దెబ్బ తగిలి విపరీతమైన నొప్పి వేధిస్తున్నప్పటికీ, పెయిన్‌కిల్లర్స్ వేసుకుని 61 బంతుల్లో 58 విలువైన పరుగులు సాధించాడు. భారత్ ఒక వికెట్ తేడాతో థ్రిల్లింగ్ విజయం సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

టీ20 క్రికెట్‌లో చాహల్ అరుదైన రికార్డు..

- 400 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా ఘనత
-సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో చారిత్రక మైలురాయిని అందుకున్న లెగ్ స్పిన్నర్
-భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా కన్నా చాహల్ ముందంజ
-ప్రపంచ జాబితాలో ఆఫ్ఘన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానం



భారత సీనియర్ లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 400 వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2026-27లో భాగంగా, హరియాణా తరఫున ఆడుతున్న చాహల్.. బుధవారం తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఈ మైలురాయిని చేరుకున్నాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఈ రికార్డుకు కేవలం ఒక్క వికెట్ దూరంలో ఉన్న చాహల్, అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు పడగొట్టాడు. తన నాలుగు ఓవర్ల స్పెల్‌లో కేవలం 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీయడంతో, తమిళనాడు జట్టు 124 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ ప్రదర్శనతో, చాహల్ తన టీ20 కెరీర్‌లో మొత్తం వికెట్ల సంఖ్యను 402కు (246 మ్యాచ్‌లలో) పెంచుకున్నాడు. ఈ ఘనతతో, టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో చాహల్ తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. అతడి తర్వాత భువనేశ్వర్ కుమార్ (366), జస్ప్రీత్ బుమ్రా (354), పీయూష్ చావ్లా (329), రవిచంద్రన్ అశ్విన్ (323) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 2023 నుంచి భారత జాతీయ జట్టుకు దూరంగా ఉన్నప్పటికీ, దేశవాళీ టోర్నమెంట్లు, ఫ్రాంచైజీ క్రికెట్‌లో చాహల్ నిలకడగా రాణిస్తున్నాడు. గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన చాహల్‌ను.. 2025 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ జట్టుకు రూ. 18 కోట్లకు కొనుగోలు చేసింది.

పంజాబ్ కింగ్స్‌లోకి హార్దిక్ పాండ్యా ఎంట్రీ..
అసలు వ్యూహం బయటపెట్టిన రికీ పాంటింగ్!

-భారీ ట్రేడ్ ద్వారా హార్దిక్ పాండ్యాను సొంతం చేసుకున్న పంజాబ్ కింగ్స్
-హార్దిక్‌కు బదులుగా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను బదిలీ చేసిన పంజాబ్ ఫ్రాంచైజీ
-హార్దిక్ చేరికతో జట్టు సమతూకంగా మారిందన్న పంజాబ్ కోచ్ రికీ పాంటింగ్
-అవసరమైన అన్ని స్థానాలను పటిష్ఠం చేసుకున్నామని వ్యాఖ్య
-ఐపీఎల్ 2027 కోసం 19 మందిని రీటైన్ చేసుకుని, ఆరుగురిని రిలీజ్ చేసిన పంజాబ్



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రాకతో ఐపీఎల్ 2027 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ జట్టు సమతూకంగా మారిందని ఆ జట్టు ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. వేలానికి ముందే ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఇచ్చి, భారీ ట్రేడింగ్ ద్వారా హార్దిక్‌ను పంజాబ్ తమ గూటికి చేర్చుకుంది. పేస్, స్పిన్ విభాగాల్లో నాణ్యమైన ఆల్‌రౌండర్ల బలం తమకు కలిసొచ్చే అంశమని పాంటింగ్ తెలిపాడు. రాబోయే సీజన్ కోసం తాము కేవలం ఆరుగురు ఆటగాళ్లను మాత్రమే విడుదల చేసి, 19 మందిని రీటైన్ చేసుకున్నట్లు పాంటింగ్ వెల్లడించాడు. "హార్దిక్ రాకతో పాటు ఇప్పటికే జట్టులో ఉన్న మార్కో జాన్సెన్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా, శశాంక్, సూర్యాంశ్ షెడ్గే, కూపర్ కానోలీ వంటి ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్ విభాగాల్లో అవసరమైన అన్ని స్థానాలను భర్తీ చేసుకున్నాం. డిసెంబరు 16న గోవాలో జరిగే వేలంలో మా ప్రధాన లక్ష్యం తుది జట్టును మరింత పటిష్ఠం చేసుకోవడమే. ఆ తర్వాత భవిష్యత్తు కోసం ప్రతిభావంతులైన యువ భారత ఆటగాళ్లను ఎంపిక చేయడంపై దృష్టి పెడతాం" అని పాంటింగ్ తెలిపాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ నుంచి వెటరన్ పేసర్ మహమ్మద్ షమీని రాజస్థాన్ రాయల్స్ ట్రేడ్ ద్వారా దక్కించుకుంది. సంజూ శాంసన్ జట్టును వీడిన తర్వాత ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నామని రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ కుమార్ సంగక్కర చెప్పాడు. ఇప్పటికే రవీంద్ర జడేజా, సామ్ కరన్, డొనొవన్ ఫెరీరా వంటి ఆటగాళ్లను ట్రేడ్ ద్వారా తీసుకున్నామని, జట్టు ప్రధాన బలం అలాగే ఉందని ఆయన పేర్కొన్నాడు. ఇక వెస్టిండీస్ హిట్టర్ షిమ్రాన్ హెట్‌మయర్ భిన్నమైన బ్యాటింగ్ స్థానాన్ని కోరుకోవడంతో పాటు, వేలంలో పర్స్ వాల్యూ పెంచుకునేందుకే అతడిని విడుదల చేయాల్సి వచ్చిందని సంగక్కర వివరించాడు.

ఆ తప్పునేనెప్పటికీచేయను

అక్క' వెబ్ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా దక్షిణాది సంప్రదాయంపై, అలాగే దక్షిణాదికి చెందిన ఓ అగ్ర హీరో సినిమాపై రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేకెత్తించాయి. ఆ సమయంలో ఆమె పక్కనే కీర్తి సురేశ్ కూడా ఉండటం, నవ్వుతూ ఆమె మాటలు వినడం కూడా విమర్శలకు కారణమైంది. దీనిపై తాజాగా కీర్తి సురేశ్ స్పందించారు. తన తాజా సినిమా 'సత్యవాన్ సావిత్రి' సినిమా ప్రమోషన్‌లో భాగంగా రాధిక ఆప్టే మాటలను ఆమె ప్రస్తావిస్తూ 'సినిమాలో మేనమామతో పెళ్లి గురించి రాధిక ఆప్టే ఏ ఉద్దేశంతో మాట్లాడారో అప్పుడు నాకర్థం కాలేదు. ఆమె మన దక్షిణాది సాంప్రదాయం గురించి మాట్లాడుతున్నదని ఆ తర్వాత అర్థమైంది. ఉత్తరాది వాళ్లకు మన సాంప్రదాయాల గురించి తెలియకపోవచ్చు. నావరకూ నేను మన సంస్కృతిని ఎప్పటికీ తక్కువ చేసి మాట్లాడను' అంటూ వివరణ ఇచ్చారు కీర్తి సురేశ్.



బాక్సాఫీస్ వద్ద 'ఈఎన్ఈ రిపీట్' దూకుడు..
తొలి రోజే రూ.15 కోట్ల వసూళ్లు!

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈఎన్ఈ రిపీట్' బాక్సాఫీస్ దగ్గర తొలి రోజే మంచి వసూళ్లను రాబట్టింది. 2018లో వచ్చి కల్ట్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ నగరానికి ఏమైంది సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.15.27 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా, తొలి రోజే పార్ట్-1 లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసిందని చిత్రబృందం తెలిపింది.రుణ్ భాస్కర్ దర్శకత్వంలో వివేక్ సాగర్ సంగీతంతో వచ్చిన ఈ సినిమాను ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా సంస్థలు నిర్మించాయి. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేష్ కాకుమాను, అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ ఈ గ్యాంగ్‌తో కలిసి మరోసారి సందడి చేశారు. మరోవైపు ఈ సినిమా పార్ట్1కి ఉన్న క్రేజ్ వలన ఓవర్సీస్‌లో కూడా దూసుకుపోతుంది.





ఎట్టకేలకు ఊపందుకున్న మెగాస్టార్ 'విశ్వంభర'..

-ట్రైలర్ రెడీ, రిలీజ్ డేట్ ఎప్పుడో?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఫాంటసీ సినిమా 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొంతకాలంగా ఈ సినిమా విడుదల ఆలస్యం అవుతూ రావడంతో ఫ్యాన్స్‌లో కాస్త నిరాశ కనిపించింది. కానీ ఇప్పుడు మళ్లీ ఈ ప్రాజెక్ట్ ఊపందుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'విశ్వంభర' ట్రైలర్ కట్ ఇప్పటికే సిద్ధంగా ఉందట. మరోవైపు డబ్బింగ్ పనులను కూడా చిత్రబృందం చాలా వేగంగా పూర్తి చేస్తోంది. దీంతో సినిమా పనులు దాదాపు ఓ కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది.ఇప్పుడు అందరి దృష్టి సినిమా విడుదల తేదీపైనే ఉంది. ఇప్పటివరకు రిలీజ్ డేట్ విషయంలో రకరకాల వార్తలు వినిపించినా, అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ట్రైలర్, డబ్బింగ్ పనులు వేగంగా జరుగుతుండటంతో, త్వరలోనే రిలీజ్ డేట్‌పై కూడా స్పష్టత వస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. నిర్మాతలు ట్రైలర్‌తో పాటు విడుదల తేదీని ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి. ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష నటిస్తుండగా, ఆషికా రంగనాథ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కీరవాణి, గౌర హరి సంగీతం అందిస్తున్నారు. ఫాంటసీ కథకు కీరవాణి మ్యూజిక్ పెద్ద ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. చాలా రోజుల తర్వాత వస్తున్న ఈ అప్‌డేట్లతో మెగా అభిమానుల్లో మళ్లీ జోష్ మొదలైంది.



ఆ హీరో అందానికి
ఫిదా అయ్యాను..

-చాలా హ్యాండ్సమ్‌గా ఉంటాడు! మనసులో మాట బయటపెట్టిన అనుపమ

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. మలయాళ చిత్ర పరిశ్రమలో నటిగా కెరీర్ ప్రారంభించిన ఈ అందాల భామ.. తెలుగులో వరుస సినిమాలు చేస్తూ ఇక్కడి ప్రేక్షకులకు మరింత చేరువైంది. మొదట్లో పక్కింటి అమ్మాయి తరహా పాత్రలతో ఆకట్టుకున్న అనుపమ.. ఆ తర్వాత తన నటనలో కొత్తదనాన్ని చూపిస్తూ విభిన్నమైన కథలను ఎంచుకుంటోంది. ముఖ్యంగా కథకు ప్రాధాన్యత ఉన్న సినిమాలు, ప్రయోగాత్మక పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేస్తోంది.హీరోయిన్‌గా మాత్రమే కాకుండా నటిగా తన పరిధిని పెంచుకోవడంపై అనుపమ ప్రత్యేక దృష్టి పెట్టింది. అందుకే కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది. పాత్ర నిడివి కంటే అందులో తనకు నటనకు ఎంత అవకాశం ఉందనే విషయానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె ఎంపికలు చూస్తే అర్థమవుతోంది. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనుపమ పరమేశ్వరన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి.ముఖ్యంగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి ఆమె చెప్పిన మాటలు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మహేష్ బాబు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయనపై క్రష్ ఉందని అనుపమ చెప్పుకొచ్చింది. ఇంటర్వ్యూలో యాంకర్ మహేష్ బాబు గురించి ఒక్క మాటలో చెప్పాలని అడగ్గా.. అనుపమ తనదైన శైలిలో స్పందించింది. మహేష్ చాలా హ్యాండ్సమ్ అని, ఆయన అందం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొంది.అంతేకాకుండా ఆయనంటే తనకు క్రష్ ఉందని మనసులోని మాటను బయటపెట్టింది. అంతటితో ఆగకుండా మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించే అవకాశం వస్తే చేస్తారా? అని యాంకర్ మరో ప్రశ్న సంధించింది. దీనికి అనుపమ ఏమాత్రం తడబడకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహేష్ సినిమాలో విలన్ పాత్ర చేయడానికి కూడా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. అయితే మహేష్ బాబును సినిమాలో కోపంగా చూడాల్సి వస్తే మాత్రం తాను ఆ పాత్రకు న్యాయం చేయలేకపోవచ్చని సరదాగా చెప్పింది.ఆయనను చూస్తూ ఉంటే విలన్‌లా కాకుండా రొమాంటిక్‌గా చూడాలనిపిస్తుందని, ఆయన తన వైపు చూస్తే అసలు నటించడం కూడా మర్చిపోయే అవకాశం ఉందని నవ్వులు పూయించింది.ప్రస్తుతం అనుపమ చేసిన ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. మహేష్‌పై తన అభిమానాన్ని ఇంత సరదాగా వ్యక్తం చేయడంతో ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొత్తానికి తెరపై విభిన్న పాత్రలతో అలరిస్తున్న అనుపమ.. తన అభిమాన హీరో గురించి చేసిన ఈ వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచింది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com